క్లుప్తంగా

70 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న పోలీసు సిబ్బంది

ఉదయగిరి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ వి.గిరిబాబు ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల ఎస్సైలు, సిబ్బంది, స్థానిక యువకులు సుమారు 70 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సీఐ గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, విజయ్ శ్రీనివాస్, నెల్లూరు, ఉదయగిరి రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదుపై సోషల్ ఆడిట్



అర్హుల జాబితా ప్రకటిస్తున్న ఏఓ తదితరులు

ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లి, గుడినరవ రైతుభరోసా కేంద్రాల్లో శనివారం పంట నమోదుపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు అంజనేయులు, జయశ్రీ సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ క్రాప్ బుకింగ్ రికార్డులు తనిఖీ చేసి అర్హుల జాబితాను ప్రకటించారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను వ్యవసాయ సిబ్బందిని కలిసి తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతుకు పంట నమోదు ప్రధానమన్నారు. పంటన నమోదు చేసుకోకపోతే వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు వర్తించవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్కు రమణమ్మ, వీఏఏ కనిష్క, రైతులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు జాబితా ప్రదర్శన

అల్లూరు: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈ–పంట నమోదు వివరాలు సోషల్ ఆడిట్ కోసం ఆర్బీకేల్లో జాబితాను ఈ నెల 29వ తేదీ వరకు అందుబాటులో ఉంచామని ఏఓ వి.అశోక్ తెలియజేశారు. ఈ జాబితాలో విస్తీర్ణం, పంట పేరు ఖాతా నంబరు, సర్వే నంబరు, రైతు పేర్లు ఏవైనా పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే సరిజేస్తామన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష



రోగులతో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

కావలి: పట్టణంలోని 32, 33, 34, 37 వార్డులకు చెందిన జగనన్న ఆరోగ్య సురక్ష శనివారం స్థానిక కళుగోళమ్మపేటలోని మున్సిపల్ హైస్కూల్లో జరిగింది. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి రోగులను పలకరించి వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రాజెక్ట్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి

సోమశిల: సోమశిలలోని ప్రాజెక్ట్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి తనిఖీ చేశారు. మూడేళ్ల కేసులు, రికార్డులను పరిశీలించారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు సీఐ జీ వేణు, ఎస్సై భోజ్యానాయక్, ఏఎస్సై లక్ష్మణరావు, కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

దుత్తలూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉదయగిరి నియోజకవర్గంలో ఈ నెల 30న జరగనున్న సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు లెక్కల లక్ష్మీకాంతమ్మ శనివారం ఒక ప్రకటనలో కోరారు. జలదంకి నుంచి ప్రారంభమయ్యే యాత్రకు మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు

టీడీపీ నేతల బతుకంతా విష ప్రచారాలే



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి: విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై కొందరు దుండగులు అకారణంగా మానవత్వం మంట కలిపేలా దాడులు చేస్తే, బాధాకరమైన ఘటనతో రాజకీయంగా లబ్ధి పొందాలనే నీచమైన దుర్బుద్ధితో టీడీపీ నేతలు ప్రవర్తిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. తమ బతుకంతా విష ప్రచారాలే అని మరోసారి నిరూపించుకున్నారన్నారు. కావలిలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన ఘటన అన్నారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితులకు కఠిన శిక్ష పడేలా ఆర్టీసీ డ్రైవర్‌కు మద్దతుగా నిలవాల్సిన తరుణం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని గుర్తు చేశారు. ఈ ఘటనను కూడా రాజకీయంగా వాడుకోవాలనే నీచులు టీడీపీ నాయకులని మండిపడ్డారు. ఎక్కడ ఏ విషాదకరమైన ఘటన జరిగినా.. వాస్తవాలు తెలుసుకోకుండా తమ వైఎస్సార్‌సీపీకి, తమ నాయకులకు అంటగట్టి లబ్ధిపొందాలనే నికృష్ట ఆలోచనలతో విష ప్రచారం చేయడం వారికి అలవాటుగా మారిందన్నారు. కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై అమానుష దాడి జరిగిన ఘటన తెలియగానే స్వయంగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పోలీసు అధికారులకు ఫోన్ చేసి, ఈ కేసులో కఠినంగా వ్యవహరించాలని సూచించారన్నారు. ఘటన జరిగిన రోజు నిందితులను బాధితులు కాని, పోలీసులు కాని గుర్తించకపోవడంతో విచారిస్తున్నామని పోలీసులు ఎమ్మెల్యేకు తెలిపారన్నారు. మరుసటి రోజు దాడి ఘటన వీడియో సోషల్ మీడియాలో రావడంతో నిందితులు ఎవరో స్పష్టంగా తెలిసి పోవడంతో, పోలీసులు కూడా వేగంగా దర్యాప్తు ప్రారంభించారన్నారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు 50 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి వారి కోసం గాలిస్తున్నారని వివరించారు. అయితే టీడీపీ నేతలు వాస్తవాలను విస్మరించి నిందితులు వైఎస్సార్‌సీపీ నాయకులని, ఎమ్మెల్యేకు అనుచరులని గల్లీ నుంచి రాజమండ్రి సెంట్రల్ జైలు వరకు తమ ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సౌమ్యుడు కావడంతో ఆయనపై రాజకీయంగా బురద వేసి లబ్ధిపొందాలని ఆరాటపడుతున్నారన్నారు. నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన రోజు వాళ్లు ఎవరో ప్రజలకే తెలిసిపోతుందని, అప్పుడు టీడీపీ నాయకులు తమ తలలను తీసి ఎక్కడ పెట్టుకుంటారన్నారు. కావలిలో రౌడీయిజాన్ని కూకటి వేళ్లతో పెకిలించేయాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చూస్తున్నారన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మిగిలిన వారికి నేరాలు చేయాలంటే చలి జ్వరం కాసేలా ఉంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, పందిటి కామరాజు, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, గంగు వెంకట చంద్రశేఖర్, కనుపర్తి రాజశేఖర్, షేక్ షాహుల్ హమీద్, దామిశెట్టి సుధీర్ నాయుడు, మహేష్ నాయుడు, కలగయ్య, కలికి శ్రీనివాసులురెడ్డి, మండలి కృష్ణారావు, దేగా రాము యాదవ్, తలపనేని ప్రభాకర్‌నాయుడు, ఆత్మకూరు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ మూకలకు వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాలకీర్తి రవి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాలకీర్తి రవి

కావలి: కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన రౌడీ మూకలకు వైఎస్సార్‌సీపీకి ఎటువంటి సంబంధం లేదని, కనీసం వారికి తమ పార్టీలో సభ్యత్వం కూడా లేదని ఆ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాలకీర్తి రవి స్పష్టం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తూ, ప్రజల మన్ననలు పొందుతుంటే చూసి ఓర్వలేని టీడీపీ నేతలు, పచ్చ మీడియా రాష్ట్రంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా వారు తమ పార్టీ నేతలంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎప్పుడు కూడా అసాంఘిక శక్తుల పీచమణచాలనే చెబుతారే కానీ, దుర్మార్గాలను ప్రోత్సహించలేదన్నారు. ఆర్టీసీ డ్రైవర్‌పై ఘటనలో రౌడీమూకలు కూడా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలని చెప్పడం సిగ్గు చేటన్నారు. టీడీపీలో లోకేష్ నుంచి బీద రవిచంద్ర, మాలేపాటి సుబ్బానాయుడు వరకు తమ పార్టీపై దుష్ప్రచారం చేసి ప్రజల్లో చులకన చేయాలనే కుట్రలను ప్రజలే తిప్పికొడతారన్నారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దుర్మార్గానికి ఒడిగట్టిన నేరగాళ్లపై చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆవును బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మర్రిపాడు: బైక్‌పై అదుపు తప్పి ఆవును ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని నందవరం పెట్రోల్ బంకు సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై శనివారం జరిగింది. ఆత్మకూరు మండలం యర్రబల్లికి చెందిన తల్లి కొడుకులు మస్తానమ్మ, జస్వంత్ తమ సొంత పనిపై ద్విచక్ర వాహనంలో డీసీపల్లి మీదుగా వెళ్తున్నారు. నందవరం పెట్రోల్ బంకు సమీపానికి వచ్చే సరికే ఆవు అడ్డుగా రావడంతో ఒక్క సారిగా పడిపోయారు. హైవే అంబులెన్స్‌లో వారిని ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి



వెంకట సుబ్బయ్య (ఫైల్)

మర్రిపాడు: మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది బంగారు భవిష్యత్తును కల్పించిన ఉపాధ్యాయ సంఘ నేత వెంకట సుబ్బయ్య శనివారం మృతి చెందారు. మర్రిపాడుకు చెందిన వెంకటసుబ్బయ్య యూటీఎఫ్ నాయకుడిగా ఉపాధ్యాయుల సంక్షేమానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ ఆయన మృతిపై విశ్రాంత ఉపాధ్యాయులు కలిశెట్టి వెంకటరమణయ్య, యూటీఎఫ్ నాయకులు సుబ్బరాయుడు, నాయబ్, మోహన్ ప్రసాద్ తదితరులు సంతాపం తెలియజేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని శనివారం మరణించిన ముగ్గురి కుటుంబాలకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి తరఫున రూ.10 వేల వంతున ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని 11 వార్డు బలిజ వీధికి చెందిన కొలగాని దొరసానమ్మ, 9వ వార్డుకు చెందిన గిరిజన మహిళ ఏలూరు లక్ష్మమ్మ, 19వ వార్డుకు చెందిన ఇరగన వెంకటరమణమ్మ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కేవీ శేషారెడ్డి, మల్లవరపు జయేంద్ర వరప్రసాద్‌రెడ్డి, కొప్పోలు చిన్నపరెడ్డి, 11, 9, 19 వార్డుల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిలు చైతన్య, చిన్నపరెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, మెప్మా ఆర్‌పీ శాంతి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం ఆదర్శనీయం



దుత్తలూరు:వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజగోపాల్‌రెడ్డి, వాల్మీకి సంఘ నాయకులు



ఆత్మకూరు: ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ రాజ్ అధికారులు..



సంగం: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్యాలయ సిబ్బంది

దుత్తలూరు: మహర్షి వాల్మీకి జీవితం ఆదర్శనీయమని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నందిపాడు సొసైటీ కార్యాలయంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకి బోయలకు, బీసీలకు సముచిత స్థానం కల్పించడంతో పాటు వారి సంక్షేమానికి ఎన్నో పథకాలు చేపట్టారన్నారు. గతంలో బీసీలను ఓటు బ్యాంకుకు వాడుకున్నారే తప్ప వారికి చేసింది శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో మేకపాటి అభినవ్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, సొసైటీ డైరెక్టర్ దేవరపాటి సురేంద్ర, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నల్లబోతుల భాస్కర్, వాల్మీకి సంఘ నాయకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, సొసైటీ సీఈఓ శ్రీనివాసులు, వాల్మీకులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఆత్మకూరు రవాణా శాఖ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంవీఐ రాములు ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రవాణా శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఆటో డ్రైవర్లు, వాహనాల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకికి ఘన నివాళి

ఆత్మకూరురూరల్: రామాయణ గ్రంథ రచయిత వాల్మీకి జయంతి సందర్భంగా శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సర్దార్, ఉపాధి హామీ ఏపీఓ శిరీషారెడ్డి, ఈసీ జానకి, సాంకేతిక సహాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంగం: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు నాగరాజు వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి కార్యాలయ సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, ఆశోక్‌కుమార్, హౌసింగ్ ఏఈ కరిముల్లా, సర్వేయర్ శాంతకుమారి, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మర్రిపాడు: వాల్మీకి మహర్షి జయంతి

మర్రిపాడు: మండలంలోని పొంగూరు బీసీకాలనీలో వాల్మీకి మహర్షి 152వ జయంతి వేడుకలను శనివారం వాల్మీకి బోయ కుటుంబాలు నిర్వహించాయి. వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రామాయణం రచించిన వాల్మీకి మహర్షి జీవితం అందరికి ఆదర్శమన్నారు.



ఉదయగిరి: వాల్మీకి జయంతి వేడుకల్లో వాల్మీకిలు

ఉదయగిరి: పట్టణంలోని వాల్మీకి వీధిలో శనివారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ సామాన్య బోయ కుటుంబంలో పుట్టి కవిత్వంపై జిజ్ఞాస పెంచుకుని మహాకవిగా, రచయితగా మారి కఠోర నియమ నిష్ఠలతో రామాయణం రచించి చరిత్రలో నిచిపోయాడన్నారు. ఆయన బాటలో మనం నడచుకోవాలన్నారు. ప్రభుత్వం వాల్మీకిల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు.



ఆత్మకూరు రవాణాశాఖ కార్యాలయంలో...

మా నమ్మకం నువ్వే జగనన్నపై శిక్షణ

చేజర్ల: మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంపై మండలంలోని మడపల్లి సచివాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత అధ్యక్షతన వలంటీర్లకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నోడల్ ఆఫీసర్, ఈఓపీఆర్డీ రామయ్య మాట్లాడుతూ సంక్షేమ పథకాలు రూపంలో లబ్ధిదారులకు ఎంత లబ్ధి చేకూరిందనే దానిపై చర్చించామన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించామన్నారు. నవంబర్ 2వ తేదీ మడపల్లిలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి లబ్ధిదారుడికి ఈకేవైసీ చేయిస్తామన్నారు.

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి



హెల్త్‌క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త మేకపాటి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిచి, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెలగపాడులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల భవనాలను శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల వద్దకు పాలనను తీసుకువచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రభుత్వ పథకాలు అమలు సజావుగా కొనసాగాలంటే 2024లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అన్ని ఎల్లవేళలా అందుబాటులో ఉండే తనను ఎమ్మెల్యే గెలిపించాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో సోమవారం నిర్వహించే వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత యాత్రలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సచివాలయాల జేసీఎస్ మండల కన్వీనర్ సీహెచ్ సుబ్బారెడ్డి, సర్పంచ్ దేవబోయిన వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టేల నాగేంద్రరెడ్డి, బొల్లినేని వెంకటసత్యనారాయణ, మాలేపాటి వెంకటసుబ్బయ్య, హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడి హేయం



ఉదయగిరి: డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఉదయగిరి: కావలి సమీపంలోని మద్దూరుపాడు వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై శుక్రవారం రౌడీమూకలు దాడి చేయడం హేయమైన చర్య అని, నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజారవాణా సంస్థ ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక డిపో ఎదుట శనివారం జేఏసీ ఆధ్వర్యంలో దాడిని ఖండిస్తూ, గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన తెలియజేశారు. నాయకులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బెంగళూరు నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు కావలి ట్రంక్‌రోడ్డులో ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న వాహనాన్ని తొలగించమని హారన్ కొట్టినందుకు సభ్యసమాజం తలదించుకునేలా ఆర్టీసీ డ్రైవర్‌ను బస్సులో నుంచి దింపి తీవ్రంగా కొట్టడం సిగ్గు చేటన్నారు. ఈ ఘటన డ్రైవర్లను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్దానీ బాషా, పెంచలయ్య, నాగరాజు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలు పారదర్శకంగా పనిచేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్వో ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: నియోజక వర్గంలోని బూత్ స్థాయి అధికారులు పారదర్శకంగా పని చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.రాజారమేష్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆయన శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఓటర్ల ముసాయిదా జాబితా విడుదలైందన్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 27 నుంచి ఈ ఏడాది డిసెంబర్ 9వ తేదీలోగా తెలియజేయాలన్నారు. బీఎల్వోలు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి నుంచి ఫాం–6 సేకరించి ఓటు నమోదు చేయాలన్నారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. పోలింగ్ బూత్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ సమావేశంలో తహసీల్దారు సానా శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

వాగు పోరంబోకు ఆక్రమణలపై కొరడా



వీవర్స్ కాలనీ సమీపంలో ఆక్రమిత వాగు పోరంబోకు స్థలం కొలతలు వేసి జేసీబీతో కందకాలు తవ్విస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని వీవర్స్‌కాలనీ సమీపంలో సర్వే నంబరు 581లోని 94 ఎకరాల వాగు పోరంబోకు ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులు శనివారం చర్యలు ఉపక్రమించారు. సర్వే నంబరు హద్దులను గుర్తించి జేసీబీతో 94 ఎకరాల చుట్టూ కందకాలు తవ్వే పని చేపట్టారు. ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొత్తం విస్తీర్ణంలో గతంలో వీవర్స్ కాలనీలో పది మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా, మిగిలిన భాగం చాలా వరకు ఇతరులు ఆక్రమించుకున్నారన్నారు. 20 మంది దళితులకు ఏక్‌సాల్ లీజ్ పట్టాలు ఇచ్చారని, మరో 15 ఎకరాలు ఒక విద్యా సంస్థకు రెవెన్యూ అధికారులు మార్కెట్ వ్యాల్యూ ప్రకారం ఇచ్చినట్లుగా తెలుస్తుందన్నారు. నిబంధనల ప్రకారం ఈ విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ స్థలంలో కంప చెట్లను పూర్తిగా తొలగించి 67వ నంబరు జాతీయ రహదారి వరకు విశాలంగా అందరికి కనిపించేలా చర్యలు చేపడతామన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

సంగమేశ్వరాలయం మూసివేత



ఆత్మకూరురూరల్: మహిమలూరులోని రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం తలుపులు మూసివేస్తున్న అర్చకులు



సంగమేశ్వరాలయాన్ని మూసివేసిన దృశ్యం

సంగం: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం చంద్రగ్రహణం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు టంగుటూరు గోపాలకృష్ణమూర్తి మూతవేశారు. రాత్రి ఒంటి గంట సమయంలో పాక్షిక చంద్రగ్రహణం ఉంటుందని అర్చకులు తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటలకు సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని తిరిగి తెరిచి దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు.

ఆత్మకూరులో పలు ఆలయాలు..

ఆత్మకూరురూరల్: చంద్రగ్రహణం కారణంగా మండలంలోని అన్ని దేవాలయాలను శనివారం సాయంత్రం నుంచి మూసివేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో సంప్రోక్షణ, స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఆత్మకూరులోని శివాలయం, అలఘనాథస్వామి దేవాలయం, మహిమలూరులోని పురాతన శ్రీరుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం, వాశిలిలోని వరద రాజస్వామి ఆలయం, తదితర దేవాలయాలను మూసివేశారు.



దుత్తలూరు: మూసివేసిన ఆలయ తలుపులు

వెంగమాంబ ఆలయం..

దుత్తలూరు: మండలంలోని నరవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానాన్ని పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం 4 గంటల నుంచి మూసివేశారు. ఆదివారం ఆలయ సంప్రోక్షణ, శుద్ధి అనంతరం ఉదయం 9 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తామని ఈఓ ఉషశ్రీ తెలిపారు.